

మాగిలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



పిట్లం మండలం మార్దండలో..



మంగ్లూర్ గ్రామంలో..

# భక్తిశ్రద్ధలతో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

• మండపాల వద్ద కుంకుమార్చన • భక్తులకు అన్నదానం

నమస్తే తెలంగాణ యంత్రాంగం, అక్టోబర్ 19: ఎల్లారెడ్డి పట్టణంలోని వైశ్యభవన్‌లో ఉన్న వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రుల్లో భాగంగా 5వరోజు అమ్మవారిని లలితాదేవీగా అలంకరించి నవవిధార్చనలతో ఘనంగా పూజలు చేశారు. అమ్మవారికి అభిషేకాలు నిర్వహించిన అనంతరం లలితాదేవీగా అలంకరించారు. లలితా సహస్ర నామాలు చదివిన అనంతరం వేదపండితుడు కొండంబొట్ల రాజేశ్వర శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి కాజు, బాదం, కిస్‌మిస్, పసుపు, కుంకుమ, చిట్టిగాజులు, లక్ష్మీగవ్వలు, గోమతి చక్రాలు, గురిగింజలు, నాణేలతో నవవిధార్చన నిర్వహించారు. అనంతరం కార్యక్రమానికి వచ్చిన భక్తులకు అన్నవితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. పట్టణంలోని శ్రీమాత దుర్గా మండపం వద్ద బుధవారం రాత్రి 360 దీపాలతో శివలింగాన్ని తయారుచేశారు. ప్రణయ్ పంతులు ఆధ్వర్యంలో పూజాకార్యక్రమాలు నిర్వహించారు. హౌసింగ్ బోర్డు యూత్ దుర్గామండలి వద్ద వేద పండితుడు శివకుమార్ శర్మ ఆధ్వర్యంలో పూజలు, కుంకుమార్చన కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు.

నిజాంసాగర్ మండలంలోని మాగి గ్రామ దుర్గామాత మండపం వద్ద నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో సర్పంచ్ అంజయ్యతోపాటు నిర్వాహకులు పండరి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. మంగ్లూర్ గ్రామంలో అమ్మవారికి ఒడిబియ్యం పోశారు. సర్పంచ్ స్వప్నా రమేశ్, లక్ష్మారెడ్డితో పాటు భక్తులు పాల్గొన్నారు. నర్వ గ్రామంలో సర్పంచ్ సంగమణి రాములు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తులకు దుర్గామాత చరిత్ర పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయా మండపాల వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సదాశివనగర్‌లోని కాకతీయనగర్ దుర్గా పరివార్ మండపం వద్ద హోమం నిర్వహించారు. పలువురు దంపతులు పాల్గొన్నారు. ప్రతిరోజూ దాండియా నిర్వహించి రాత్రి 12 గంటలకు బహుమతులను అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మండపం వద్ద శుక్రవారం అన్నదానం ఉంటుందన్నారు.

తాడ్వాయి మండలంలోని ఆయా గ్రామాల్లో దుర్గామాత మండపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలను నిర్వహిస్తున్నారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తున్నారు.

డోంగ్లీ మండలంలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. దుర్గామాతను లక్ష్మీ దేవి రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మాలధారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పిట్లం మండలంలో దేవీ నవరాత్రి ఉత్సవాలను భక్తులు ఘనంగా నిర్వహిస్తున్నారు. మండలకేంద్రంలోని పార్వతీదేవి ఆలయంలో గురువారం ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించి లలితా దేవి రూపంలో అలంకరించారు. మార్దండ గ్రామంలో దుర్గామాత మండపం వద్ద మహిళలు మంగళహారతులతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.



ఎల్లారెడ్డిలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో నవవిధార్చన నిర్వహిస్తున్న మహిళలు



ఎల్లారెడ్డిలో శ్రీమాత దుర్గా మండపం వద్ద దీపార్చన



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## బీఆర్ఎస్ ప్రచార రథం ప్రారంభం

సదాశివనగర్, అక్టోబర్ 19: బీఆర్ఎస్ ఎన్నికల ప్రచార రథాన్ని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి గురువారం ప్రారంభించారు. మత్తడి పోచమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. గ్రామగ్రామాన ప్రచారం నిర్వహించి సురేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని అన్నారు. కార్యక్రమంలో జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు మొయినుద్దీన్, రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ నాయక్, గాదారి అశోక్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరి దుర్మరణం

డోంగ్లీ, అక్టోబర్ 19: మండలంలోని మొఘా గ్రామానికి చెందిన పులికాండ్లవార్ సంజీవ్(45) ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడని ఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సంజీవ్‌కు మద్యం తాగే అలవాటు ఉన్నది. అనారోగ్యంతో కొంతకాలంగా మద్యం తాగడం బంద్ చేశాడు. దీంతో మానసిక పరిస్థితి బాగాలేదు. ఈనెల 17వ తేదీన ఇంట్లో నుంచి వెళ్లిన అతడు తిరిగి రాలేదు. గురువారం అతడి మృతదేహం స్థానిక చెరువులో లభ్యమైంది. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## ధాన్యం పరిశీలన

ఎల్లారెడ్డి, అక్టోబర్ 19: మెల్లకుంట తండాలో ధాన్యాన్ని నాగిరెడ్డిపేట జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ధాన్యం బాగా ఆరబెట్టాలని రైతులకు సూచించారు. ప్రభుత్వం త్వర లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని చెప్పారు.

## పన్ను వసూలు చేయాలి

గాంధారి, అక్టోబర్ 19: ఇంటి పన్నును సకాలంలో వసూలు చేయాలని ఎంపీవో రాజ్‌కిరణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని హేమ్లానాయక్ తండా గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఆయన గురువారం పరిశీలించారు.

## హోరాహోరీగా సాగుతున్న కబడ్డీ పోటీలు

నిజాంసాగర్, అక్టోబర్19: మండలంలోని నర్వ గ్రామంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద ఉమ్మడి జిల్లా కబడ్డీ పోటీలను గురువారం ప్రారంభించారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలోని 24 జట్లు పోటీలో తలపడుతున్నాయి. మూడు రోజులపాటు నిర్వహించే ఈ పోటీలు గురువారం ప్రారంభం కాగా.. ఆయా జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ప్రతి సంవత్సరం దుర్గామాత మండపం తరఫున పలు రకాల క్రీడలను నిర్వహిస్తామని, అందులో భాగంగా ఈ సంవత్సరం కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.పదివేలు, రెండో బహుమతిగా రూ.ఐదు వేల నగదును అందజేస్తామని తెలిపారు. నిర్వాహకులు హరీశ్‌గౌడ్, రాకేశ్‌గౌడ్, రాజు, ఈశ్వర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

## జోరుగా బతుకమ్మ సామగ్రి విక్రయాలు



పిట్లంలో బతుకమ్మ సామగ్రిని విక్రయిస్తున్న వ్యాపారులు

పిట్లం, అక్టోబర్ 19: మండలకేంద్రంలో గురువారం బతుకమ్మ సామగ్రి విక్రయాలు జోరుగా సాగాయి. వ్యాపారులు బతుకమ్మకు సంబంధించి శిఖిలం, పువ్వులకు అద్దే పలు రకాల రంగులు, కాగితం బతుకమ్మలను విక్రయించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి కావాల్సిన సామగ్రిని కొనుగోలు చేశారు.

## పంటలను పరిశీలించిన వ్యవసాయాధికారి

గాంధారి, అక్టోబర్ 19: మండల కేంద్రంతోపాటు బొప్పాజివాడి గ్రామ శివారుల్లో రైతులు సాగుచేస్తున్న కంది, వరి పంటలను మండల వ్యవసాయాధికారి నరేశ్ గురువారం పరిశీలించారు. పంటలపై చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పిచికారీ చేయాల్సిన మందులను వివరించారు. రైతులు వ్యవసాయాధికారుల సూచనలు, సలహాల మేరకు పంటలపై పురుగు మందులను పిచికారీ చేయాలని, అనవసరంగా మందులను వాడితే రైతులకు ఖర్చు పెరుగుతుందని అన్నారు. ఆయనవెంట పలువురు రైతులు ఉన్నారు.



గాంధారిలో వరిని పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి నరేశ్